# ప్రాప్తమున్నతీరం

ప్రఫుల్ల చంద్ర



విజయవాడలో ప్రఖ్యాత హోటల్...

రోజుకు ఐదు వందలు అద్దె అయితేనేం - హోటల్‌లో గది టీ.వి. ఫోన్, మెత్తని సోఫాలు, ఫోం బెడ్, ఏ.సి.లతో దర్జాగా, చల్లగా హాయిగా ఉంది. ఇంకా హాయిగా బెడ్‌మీద అతని ఒడిలో ఆమె! ఉప్మాలో పెసరట్టు ముక్క మెదిపి ఆమెకు అందిస్తూ అతడు....

హఠాత్తుగా బజర్ మోత...

కార్తీక్ తలుపు తెరవగానే లోనికి దూసుకొచ్చిన పోలీసు ఇన్‌స్పెక్టర్ "యు ఆర్ అండర్ అరెస్ట్...." గర్జించాడు డేగ లాగ చుట్టూ చూస్తూ.

కార్తీక్ ఒణికిపోతున్నాడు. నోట మాట రావడంలేదు.

బెడ్‌మీద నుంచి లేచి, పైట నిండుగా కప్పుకుని, ధైర్యం కూడదీసుకుని ఇన్‌స్పెక్టర్ ఎదుటికొచ్చింది స్వప్న. "సార్! మేము ఏ తప్పూ చేయలేదు. ప్రేమించుకున్నాం. పెద్దలు అంగీకరించలేదు. ఇంటి లోంచి వచ్చేశాం. నేను మైనర్‌ని కాదు. నమ్మండి సార్!" బ్రతిమాలింది.

ఆమె కన్నీళ్ళకు కరగని ఇన్‌స్పెక్టర్ "పదండి పోలీసు స్టేషన్‌కు" గద్దించాడు.

"ఆడకూతురు ఆక్రోశిస్తుంటే జాలి లేదా?" అంటూ ఆరడుగుల అందగాడు, హోటల్ యజమాని కొడుకూ పైగా ఇన్‌స్పెక్టర్‌కి స్నేహితుడూ అయిన విక్కీ లోనికొచ్చి చొరవగా బెడ్‌మీద కూర్చుంటూ అన్నాడు.

"ఈ మధ్య పోలీసులే ప్రేమ వివాహాలు జరిపిస్తున్నారు కదా! అలాగే వీరి పెళ్ళి కూడా జరిపిస్తే ఒక పనయిపోతుంది" అని సలహా కూడా ఇచ్చాడు.

"లేచిపోయిన కేసు అయితే అలాగే చేయవచ్చు కానీ ఇది దొంగతనం కేసు. రెండు లక్షలు కాజేసి పారిపోయారని అమ్మాయి తండ్రి రిపోర్టు చేశాడు" తనూ బెడ్ మీద విక్కీ ప్రక్కనే కూర్చున్నాడు ఇన్‌స్పెక్టర్.

భయం భయంగా తలవంచుకుని వున్న స్వప్న వైపు ఓ క్షణం చూశాడు. బెదురుగొడ్డులా ఉన్న కార్తీక్‌వైపు అరక్షణం చూశాడు. దీర్ఘాలోచనలో ఒక క్షణం తర్వాత....

"నువ్వు అమ్మాయిని లాక్కుపోయి తండ్రికి అప్పగిస్తే ఆయన నీకో పాతిక వేలు బహుమతి యివ్వొచ్చు. ఆ పాతికా ఆమె నీకిస్తుంది... వదిలెయ్" పరిష్కారం సూచించాడు విక్కీ.

అయిష్టంగానే ఇన్‌స్పెక్టర్ అంగీకరించగా, మనసులో తిట్టుకుంటూ పాతిక వేలూ ఇచ్చుకుంది స్వప్న. ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయాక.

తమని రక్షించినందుకు విక్కీని పొగడ్తల్లో ముంచెత్తారు స్వప్న, కార్తీక్.

"నన్ను పొగడనక్కరలేదు. మిమ్మల్ని అరెస్టు చేస్తే జరిగే ప్రచారంవల్ల మా హోటల్ పరువు పోతుందని కలగజేసుకున్నాను. అంతే!" తేలిగ్గా నవ్వేశాడు విక్కీ.

ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయినా విక్కీ కదలకపోవడంతో మరొక వాయ పొగడ్తలు కురిపించి తమ కథ కొంచెం వినిపించాడు కార్తీక్.

కార్తీక్ బీదవాడు. స్వప్న కోటీశ్వరుని కూతురు. సినిమాలో మాదిరి ఇద్దరి చూపులూ కలిసి ప్రేమబాటలు వేశాయి. సినిమాలో మాదిరిగానే ఆమె తండ్రి రంకెలేసి మరొకరితో పెళ్ళిచూపులకు ముహూర్తం నిర్ణయించాడు. దిక్కు తోచని పరిస్థితిలో అర్ధరాత్రి బయలుదేరి స్వప్న కార్తీక్ ఇలా వచ్చేశారు. ఈ రోజు ఈ ఊళ్ళోనే కార్తీక్‌కి ఏదో ఇంటర్‌వ్యూ ఉంది. ఉద్యోగం దొరికితే కష్టాలు తీరిపోయినట్టే....

బెస్టాఫ్ లక్ చెప్పి వెళ్ళిపోయాడు విక్కీ. కార్తీక్ ఇంటర్‌వ్యూకి వెళ్ళగా ఒంటరిగా ఉన్న స్వప్న వద్దకు మళ్ళీ వచ్చాడు.

కాసేపు మామూలు కబుర్లు అయ్యాక...

"ప్రేమించి లేచిపోవడం తప్పు కాదు గానీ, నీ ఎంపికే సరిగా లేదు. వాడొక బడుద్దాయి లాగా కనిపిస్తున్నాడు. నీ డబ్బు తినేసి పారిపోగలడు జాగ్రత్త!" అన్నాడు ఎగతాళిగా.

"లేచిపోవడం" అన్న మాటకు సర్రున కోపం వచ్చింది స్వప్నకు. పైగా అతడు తనని ఏక వచనంలో సంబోధించడం, కార్తీక్‌ని విమర్శించడం నచ్చలేదు. అయినా ఆపదలో రక్షించాడు కనుక కోపాన్ని దిగమింగి "కార్తీక్‌మీద

నాకు అచంచల విశ్వాసం" అంది ఖండితంగా.

"ఖరీదైన హోటల్‌లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తోంటే నీవు దొంగిలించి తెచ్చిన డబ్బు నెల రోజుల్లో అయిపోతుంది. ఈ లోగా వాడికుద్యోగం దొరక్కపోతే ఏం చేస్తావ్?"

దొంగిలించి తెచ్చిన డబ్బు అన్నందుకు కోపం వచ్చినా తల వంచుకుందామె. అతనికుద్యోగం దొరక్కపోతే ఏం చేయాలో ఆమెకూ తెలియదు.

నఖశిఖ పర్యంతం ఆమెనే చూస్తుండిపోయాడు విక్కీ.

అమ్మాయి అందంగానే ఉంది. తీర్చిదిద్దిన కనుబొమలు రెండూ ఫాలభాగంలో కలిసిపోయి విలక్షణంగా ఆకర్షణీయంగా ఉన్నాయి. బుల్లి నోరు, పై పెదవి సన్నని విలువంపు. కింది పెదవి నిండుగా బొద్దుగా ఉండి ఊరిస్తోంది.

అందం సరే. ఆలోచనే లేదు అమ్మాయికి. ప్రేమ, ఆలోచనా ఒకే హృదయంలో ఇమడవు కాబోలు! చీరలు సెలక్టు చేసుకోవడానికి గంటలు, గంటలు వేస్టుచేసే అమ్మాయిలు ప్రేమికుడిని సెలక్టు చేసుకోవడానికి ఒక్క నిముషం కూడా ఆలోచించరు.

"స్వప్న ఆ బేవార్స్‌గాడిని కాక నన్ను ప్రేమించవచ్చు కదా!" అనుకుని నవ్వుకున్నాడు.

"ఖర్చులు తగ్గాలంటే అద్దె ఇల్లు, స్వంత వంట మంచిది. ఇల్లు దొరికే వరకు మీరు మా ఇంటిలో ఉండొచ్చు. అమ్మా నాన్నా ఊరెళ్ళడం వల్ల ఇల్లు మనందరికీ సరిపోతుంది" సలహా ఇచ్చి ఆలోచించి చెప్పమని వెళ్ళిపోయాడు విక్కీ.

* * *

విక్కీ గారింట ఒక రోజు హాయిగా గడిచింది. మరో ఇంటర్వ్యూ కోసం కార్తీక్ హైదరాబాద్‌కి బయలుదేరాడు. అతడటు వెళ్ళగానే ఇటు విక్కీ వచ్చాడు. ఒంటరిగా నున్న స్వప్న పక్కన చేరి తదేకంగా ఆమెనే చూస్తుండిపోయాడు.

ఆ చూపు, అతని ధోరణి ఆమెకు ఇబ్బందిగానే వుంది. అయినా సహించింది. తప్పదు మరి.

"నీ దగ్గరున్న డబ్బు ఎవరైనా దోచుకుపోతే నీ గతి ఏమిటి స్వప్నా?" హఠాత్తుగా అడిగాడు.

"చూడగా మీరే దోచుకునేట్టు ఉన్నారు" చిరాకు అణచిపెట్టుకుని అందామె.

గలగలా నవ్వేశాడు. "నిజమే! నేనే దోచుకోవచ్చు. లేదా, కార్తీక్... లేదా మరెవరైనా. ఎవరు దోచుకున్నారన్నది కాదు ప్రశ్న. దోచుకుంటే అప్పుడు నీ పరిస్థితి ఏమిటి? అన్నదే ప్రశ్న".

ఆ విషయం ఆలోచించలేకపోయింది. విక్కీ వెళ్ళిపోయాడు.

లంకంత ఆ కొంపలో తనూ, విక్కీ, ఒక వంట మనిషి, ఒక పని మనిషి.

అయ్యగారు చాలా మంచి వారని వంటమనిషి కథలు చెబుతూనే ఉంది. కానీ స్వప్నకు బెంగగానే ఉంది. సాలెగూడులో చిక్కుకున్నట్టు భయంగానూ ఉంది.

రాత్రి అతగాడు తన గదిలో దూరి గలాభా చేస్తే... అమ్మబాబోయ్! అతని మాటలూ, ధోరణీ అనుమానాస్పదంగానే ఉన్నాయి.

రేపే తనకు పెళ్ళిచూపులు!

అమ్మాయి లేచిపోయింది. పెళ్ళిచూపులకు రావద్దని వాళ్ళకి నాన్న ఫోన్‌చేసి ఉంటారు. ఇంటి పరువు మంటగలిసిందని, అమ్మా, నాన్నా రోదిస్తున్నారు కాబోలు.

ఆ ఆలోచన కలగగానే స్వప్న మనసు వికలం అయింది. తప్పు చేశానా అనిపించింది.

డబ్బంతా ఖర్చయిపోయినా, డబ్బు పోయినా, కార్తీక్‌కి ఉద్యోగం దొరక్కపోయినా ఏం చేస్తావని విక్కీ సంధించి వదిలిన ఒక్కొక్క ప్రశ్నా ఆమెను వ్యాకులపరుస్తున్నాయి.

## పాయసం పద్యాలు

### దేవుడే అమ్మా!

వందనం జీవం ఇచ్చిన అమ్మకు
అరుదైన ఫలాన్ని నేనా కొమ్మకు
ఋణం తీర్చుకుంటూ ఆ కంటిచెమ్మకు
ఆ అమ్మే కావాలి మరో జన్మకు!

### ది గ్రేట్ లేడీ!

తీర్చుకోలేనిది స్త్రీజాతి ఋణం
తల్లి, చెల్లి, కల్పవల్లిగా సంసేవనం
అనితరసాధ్యం, తెలుసుకోవాలి జనం
లోకం మనుగడకు స్త్రీ ప్రేమే కారణం!

### అబౌట్ కాంట్రాక్ట్!

కాంట్రాక్ట్ నిర్మాణాలేవైనా నాసిరకం
కోట్లకు పడగెత్తుతారు నిజం
పాపంలో పాత్రలు అధికార గణం
దుర్మరణాల పాలయ్యేది జనం!

### చంద్రబాబు థియరీ!

చంద్రబాబు థియరీ ఆల్‌రైటు
చదువుల పండుగ చాలా కరెక్టు
చిత్తశుద్ధి లేదు ఇది మరి డిఫెక్టు
అధికార గణం తేవాలి గొప్ప ఎఫెక్టు

- పాయసం సుబ్రహ్మణ్య మహర్షి

అన్నిటికన్నా పెద్ద సమస్య... ఈ రాత్రి గడిచేది ఎలా? విక్కీ దౌర్జన్యం చేస్తే తనని తాను రక్షించుకోగలనా? ఇవే ఆలోచనలు మళ్ళీమళ్ళీ తలెత్తుతూ మనశ్శాంతి లేకుండా చేశాయి.

అయితే విక్కీ ఆ రాత్రికి ఇంటికి రానే లేదు. హోటల్‌లోనే ఉండిపోయాడు.

విక్కీ కుదిర్చిపెట్టిన అద్దె ఇల్లు సింపుల్‌గా బాగుంది.

ఇంట్లో అడుగుపెట్టగానే, కొత్త ప్రపంచంలో అడుగుపెట్టినట్లు గుండె ఝల్లుమంది.

"ఈ జీవితం నాది! నాదే!" అని అరవాలనిపించింది. ఏదో ఘనకార్యం సాధించినట్టు ఆనందంగానూ, గర్వంగానూ ఉంది. కానీ, ఆ ఆనందం వెనక, ఆ గర్వం మాటున ఏదో భయం! ఏదో శంక!

పెళ్ళి కాకుండానే కాపురం పెట్టింది సరే. పెళ్ళి అయ్యేవరకూ కాలు జారకుండా నిగ్రహించుకోవడం సాధ్యమా? వెంటనే పెళ్ళి చేసుకోడానికి వీల్లేదాయె. మూఢం వచ్చిచచ్చింది.

విక్కీ పంపిన మనుషులు వంట సామాగ్రి కొనితెచ్చారు. ఇల్లు సర్దిపెట్టారు. తమ ఇంటిలో రెండు స్టౌలు ఉంటే ఒకటి వాళ్ళకిచ్చాడు విక్కీ. సాయంకాలం వచ్చి శుభాకాంక్షలు చెప్పి వెళ్ళాడు. అనవసరంగా అతనిని అపార్థం చేసుకున్నందుకు పశ్చాత్తాపపడింది స్వప్న. కార్తీక్ హైదరాబాద్ నుంచి వచ్చేశాడు. ఇంటర్వ్యూ బాగానే చేశాడట.

రాత్రి భోజనాలయాక దొడ్లో జామచెట్టు కింద కూర్చున్నారు స్వప్న, కార్తీక్.

పండువెన్నెల... చల్లచల్లగా పిల్లగాలులు.... ఆమె ఒడిలో అతని తల.

ఎన్నో కబుర్లు, ఎన్నో ఆశలు, మరెన్నో కలలూ, కోరికలూ కలబోసుకుని అక్కడే అలాగే నిద్రపోయారు. తెల్లారి లేచి చూస్తే ఏముంది?

దొంగలు దోచుకుపోయిన ఇల్లు వెక్కిరించింది. డబ్బూ, నగదూ పోయినందుకు స్వప్న కన్నీరుమున్నీరుగా విలపించింది. కార్తీక్ మూల కూర్చుని కుమిలిపోయాడు.

విషయం తెలుసుకుని వచ్చిన విక్కీ వాళ్ళని ఓదార్చి వెయ్యి రూపాయిలిచ్చాడు.

* * *

రెండు రోజులు గడిచాక మరో విపత్తు.

గోడుగోడున విలపిస్తూ కార్తీక్ విక్కీ ఇంటికొచ్చాడు. అతని తలకు కట్టు ఉంది. షర్ట్ మీద రక్తం మరకలు.

రాత్రి రెండు గంటల వేళ రౌడీలు తమ ఇంటిలో దూరి తనను కొట్టి పడేసి స్వప్నని ఎత్తుకుపోయారట. ఇదంతా స్వప్న తండ్రి గోపాలరావు పన్నాగమే అని కార్తీక్ అనుమానం.

పోలీసులకు రిపోర్టు చేద్దామన్నాడు విక్కీ.

"వద్దు సార్! పోలీసులు ధనవంతులకు తొత్తులు. డబ్బులేని నాకు సాయం చేయరు. ప్రేమికులెవర్ని సుఖంగా ఉండనిచ్చిందీలోకం! నేనింక మా ఇంటికి పోతా" అన్నాడు పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుతూ ఆ ప్రేమ విరాగి, కార్తీక్.

బరువుగా అడుగులేస్తూ వెళ్ళిపోతున్న అతనిని చూస్తూ లోలోనే నవ్వుకున్నాడు విక్కీ.

✳ ✳ ✳

గాలి రాని చీకటి గది. కాళ్ళూ చేతులూ స్తంభానికి విరిచి కట్టిన స్థితిలో స్వప్న! కట్లున్నచోట బాధ, కళ్ళు మంట, కడుపులో మంట. ఇదంతా కిడ్నాప్ వ్యవహారం అని ఆమెకు తెలుస్తూనే ఉంది కానీ దీనిక కర్తలెవరో!?

కళ్ళ వద్ద, నోటి వద్దా కన్నాలున్న నల్లని ముసుగు ధరించి నిండా నల్ల దుప్పటి కప్పుకున్న ఇద్దరు రౌడీలు పిస్తోలుతో బెదిరిస్తూ కాలకృత్యాలకు ఒక పావుగంట, భోజనానికి ఓ పది నిముషాలు కట్టు విప్పి పని పూర్తికాగానే మళ్ళీ కట్టి పడేస్తున్నారు.

భయం వల్ల మొదట ఆలోచించలేకపోయింది గానీ తర్వాత రౌడీలను నిశితంగా పరిశీలించింది స్వప్న. వాళ్ళలో ఒకడి ప్రవర్తన, నడక, మాటతీరు తెలిసిన వ్యక్తి లాగానే అనిపించింది. విక్కీ!... కార్తీక్?.... ఇన్‌స్పెక్టర్.... ఎవరై ఉంటారు? స్వప్న దృష్టి అతని షూస్ మీదకు మళ్ళింది. అంతే... షాక్! ఆ షూస్ ఎవరివో ఆమెకు తెలుసు!

రౌడీలు నాన్నగారిని తిట్టుకుంటున్నారు. ఆయన డబ్బు ఇవ్వనన్నారట!

"దీన్ని ముక్కలుగా నరికి కాకులకూ, గద్దలకూ వేయాలి!" కసిగా అన్నాడొకడు.

"ఆ ముక్కల పార్శిల్ ఆ గోపాల్రావుగాడికే పంపాలి" రెండోవాడి ఆక్రోశం.

"రైల్వే పార్శిల్ చేస్తారా? పోస్టల్ పార్శిలా?"

ఆ మాటలు విని ఉలిక్కిపడి గుమ్మంవైపు చూశారు రౌడీలు. అక్కడ పోలీసులూ, విక్కీ భయంతో పారిపోతున్న రౌడీలను ఒడిసి పట్టుకుని, బేడీలు తగిలించి, ముసుగులు తొలగించారు పోలీసులు. ఆశ్చర్యం! వాళ్ళలో ఒకడు కార్తీక్...!

స్వప్న కట్టు విప్పుతూ "ఆ రాస్కెల్ మీదనే కదూ నీకు అచంచల విశ్వాసం?" మృదువుగా అడిగాడు విక్కీ. ఆమె తల వాలిపోయింది.

కారులో ఆమెను ఇంటికి తీసుకెళ్ళాడు. ఆ ఇంటిలో ఇప్పుడు అతని తల్లిదండ్రులు, అక్క ఉన్నారు. వాళ్ళామెను సాదరంగా ఆహ్వానించారు. విక్కీ అక్క లక్కీ స్వప్నకు తన డ్రెస్ ఇచ్చి స్నానం చేసి రమ్మంది. ఆమె స్నానం చేశాక చర్మం రేగిపోయి బాధపెడుతున్న స్వప్న చేతులకు ఆయింట్‌మెంట్ రాసింది. విక్కీ అమ్మగారు వేడివేడి కాఫీ ఇచ్చారు.

వాళ్ళ ఆదరణ చూసి స్వప్నకు కన్నీళ్ళు తిరిగాయి.

ఆమె కాఫీ తాగాక లక్కీ ఒక బ్రీఫ్‌కేస్ తెచ్చి స్వప్న ఒడిలో ఉంచింది. ఆ బ్రీఫ్‌కేస్‌లో దొంగలు దోచుకుపోయారనుకున్న ఆమె నగలూ, నగదూ ఉన్నాయి.

"కార్తీక్ దృష్టిలో డబ్బులేని నీ విలువ ఏ పాటిదో పరీక్షించడానికే నేను దొంగతనం ఏర్పాటుచేశాను. నీ అచంచల విశ్వాసం పొందిన కార్తీక్ ఎంత నికృష్టుడో అర్థం అయింది కదా! ఈ నాటి యువకుల్లో చాలామందికి కష్టపడకుండా డబ్బు సంపాదించాలన్న యావ ఎక్కువ. అందుకే కార్తీక్ నీ వెంట పడ్డాడు. వాడు ఇంటర్వ్యూలకు వెళ్ళనే లేదు. నీ డబ్బు పోయిందనుకుని నీ ద్వారానే డబ్బు సంపాదించాలని కిడ్నాప్ డ్రామా ఆడాడు. అయితే మా మనుషులు మీ ఇంటిమీద నిఘా వేసి ఉండడంతో గుట్టు రట్టు అయింది" అంటూ స్వప్న ఇన్‌స్పెక్టర్‌కి ఇచ్చిన పాతికవేలూ ఆమెకిచ్చేశాడు విక్కీ.

అపరాధ భావన, కృతజ్ఞత, పశ్చాత్తాపం ఒక్కసారిగా ఆమె హృదయాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

ఆ సాయంకాలమే స్వప్న తల్లిదండ్రులు వచ్చారు. వారిలో ఏ బాధా, ఏ ఆందోళనా లేవు. ఆఖరి రీలులో ఏం జరుగుతుందో ముందే తెలిసిన నటీనటుల్లాగా గలగలలాడుతూ వచ్చారు.

స్వప్నని కాపాడినందుకు విక్కీని పొగడ్తలతో ముంచెత్తి...

"దైవ ఘటన అంటే మీ యువతరం నమ్మదు. కానీ, ఇప్పుడేం జరిగిందో చూశావా స్వప్నా? ఏ పెళ్ళిచూపుల్ని తప్పించుకోడానికి నువ్వు పారిపోయావో, ఆ యింటికే నువ్వు ఇప్పుడు చేరుకున్నావు. ఎవర్ని వద్దనుకున్నావో అతడే నిన్ను అడుగడుగునా కాపాడి నావను ఒడ్డుకు చేర్చాడు. ఇంత జరిగినా నిన్ను ఉదారంగా క్షమించేసి వివాహం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. అతని తల్లిదండ్రులూ కూడా అంతే ఉదారంగా మనతో బంధుత్వం కలుపుకోడానికి సమ్మతించారు. అలాంటి భర్తగానీ, ఇలాంటి అత్తమామాలుగానీ ..."

"నా లాంటి ఆడపడుచుగానీ...." డైలాగ్ అందించింది లక్కీ.

"ఔను! లక్కీ లాంటి ఆడపడుచుగానీ.... వెయ్యి జన్మలు పూజ చేసినా నీకు దొరకరు" అన్నాడు గోపాలరావు.

దిగ్భ్రాంతిగా చుట్టూ చూసింది స్వప్న. అందరి ముఖాల్లోనూ ఆనందం....

విక్కీని చూడగానే ఆమె తల వాలిపోయింది.

అతడు దగ్గరగా వచ్చి "స్వప్నా! పెళ్ళిళ్ళ పేరయ్యగారు నీ ఫొటో వారం రోజుల క్రితమే నాకిచ్చారు. మా హోటల్‌లో నిన్ను చూడగానే గుర్తించాను. వెంటనే మీ నాన్నకు ఫోన్ చేసి విషయం తెలుసుకున్నాను. కార్తీక్ అసలు స్వరూపం బైట పెట్టడానికి ప్లాన్ చేసి విజయం సాధించాను. నీ పట్ల కాస్త దురుసుగా ప్రవర్తించి ఉంటాను. క్షమిస్తావుగా..." అన్నాడు.

"ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయింది..." పాట టీ.వి.లోంచి శ్రావ్యంగా వినిపిస్తోంది.....

❋

